18-2-2000

32

# ఎన్నికల 'ఆరోగ్యా'నికి లా కమిషన్ 'చిట్కాలు'

**ఇంతకీ ఎన్నికల లక్ష్యం ప్రజాప్రాతినిధ్యమా? లేక ప్రభుత్వాల స్థిరత్వమా? ఎన్నికలలో గెలవడం, డిపాజిట్లు దక్కించుకోవడం మాత్రమే ప్రజాస్వామ్యంలో భాగాలా? స్వతంత్ర అభ్యర్థులందరూ పనిలేక ఎన్నికల్లో పోటీ చేసేవారేనా? ఎన్నికలపై లా కమిషన్ అవగాహనాసరళి ఇలా ఉంది.**



కె.బాలగోపాల్

యాభై ఏళ్ళ నాడు ఆధునిక భారతరాజ్యానికి నాంది పలికినప్పుడు ఏ ప్రాతిపదిక మీద దానిని నిలబెట్టడం జరిగిందో ఆ ప్రాతిపదికను మొత్తంగా పునః పరిశీలించే రోజులు వచ్చాయి.

పరిశీలన పట్ల అభ్యంతరం ఎవరికీ ఉండనవసరం లేదు గానీ అది ఏ కళ్ళతో జరుగుతున్నదనేది ప్రశ్న. నత్తనడక నడుస్తున్న దేశగమనం పట్ల 'కార్పొరేట్ ఎఫిషియెన్సీ'కి కలిగే విసుగు ఈ పునః పరిశీలనను శాసిస్తున్నది. దేశం వేగంగా 'అభివృద్ధి' చెందాలి. ఒక బలమైన రాజ్యం కావాలి. ప్రపంచదేశాలు చైనాను చూసి భయపడుతున్నట్టు మనల్ని చూసి భయపడాలి. 5 శాతం పెరుగుదలరేటును రెండురెట్లుచేసి మన తడాఖా ఏమిటో ప్రపంచానికి చూపించాలి. పాకిస్తాన్ మరొక్కసారి కార్గిల్ వంటి సాహసాలు చేయడానికి జంకాలి. దీనికి అడ్డంవస్తున్న అన్ని నియమాలనూ, వ్యవస్థలనూ, చట్టాలనూ మార్చిపారేయాలి. హక్కులు, ప్రజాస్వామ్యం, సంక్షేమం అనేవి దీనికి అడ్డం రాకుండా ఉన్నంతవరకు ఫరవాలేదు గానీ అడ్డంవస్తే వాటిని తొలగించాలి..అవి దేశ లక్ష్యాలలో భాగం కాదు. లక్ష్యం 'ఎదుగుదల'. మిగిలినవన్నీ దీనికి అడ్డు రానంత కాలం సహించే హంగులు మాత్రమే.


పునః పరిశీలన దృక్కులు ఈ విధంగా ఉండబట్టే ఆ మాట వింటేనే చాలామంది భయపడుతున్నారు.

'ఎన్నికల సంస్కరణల'ను ఒక ఉదాహరణగా తీసుకోవచ్చు. ఎన్నికలవ్యవస్థలో డబ్బు ప్రభావం ఎక్కువయిపోయిందనీ, రౌడీయిజం ప్రభావం కూడా ఎక్కువయిపోయిందనీ, గెలుపు ఓటములను అవే నిర్ణయిస్తున్నాయనీ చాలాకాలంగా అందరమూ ఆందోళన చెందుతున్నాము. ఎన్నికయినవారు ప్రజల ప్రతినిధులుగా, ప్రజల అభ్యున్నతికోసం కృషిచేయడం మానేసి తమ ఆస్తులు పెంచుకోవడానికీ, తమవారి ఆస్తులు పెంచుకోవడానికీ ఒక సాధనంగా చట్టసభలలో పదవులను భావిస్తున్నారని కూడా ఆందోళన చెందుతున్నాం.

ఈ ఆందోళనకు జవాబు చెప్పగల సంస్కరణలేవైనా ఉంటే వాటిని చేపడితే బాగుంటుంది. పదిశాతమే ఫలితం ఇచ్చినా, పదిశాతం ప్రయోజనం వచ్చిందని సంతోషించవచ్చును. కానీ ఎన్నికల సంస్కరణలు ఈ లక్ష్యంతో కాక ప్రభుత్వాల స్థిరత్వం పెంచడం కోసం, ఎన్నికల నిర్వహణ ఖర్చు తగ్గించడం కోసం, ఎన్నికల కోలాహలం అనే 'న్యూసెన్స్'ను వీలయినంతవరకు వదిలించుకోవడం కోసం చేపడితే ఏమనాలి?

లా కమిషన్ ఇప్పుడొక ముసాయిదాచట్టం తయారుచేసింది. అందులో ఎన్నికల అక్రమాల నివారణకు ఉపయోగపడగల అంశాలు కొన్ని ఉన్నాయి. ఆలోచించదగ్గ ప్రతిపాదనలు కొన్ని ఉన్నాయి. కానీ విపరీతమైన సంఖ్యలో చిన్న పార్టీలు ఏర్పడకుండా ఉండాలంటే ఏమి చేయాలి, కులం, ప్రాంతం మొదలయిన ప్రత్యేకతల ప్రాతిపదికన పార్టీలు ఏర్పడకుండా ఉండాలంటే ఏమి చేయాలి, బహుళపార్టీవ్యవస్థ స్థానంలో రెండు లేక మూడు పార్టీల వ్యవస్థ ఏర్పడాలంటే ఏ రకమైన సవరణలు చేపట్టాలి అనేది లా కమిషన్ ప్రతిపాదనలకొక ముఖ్య ప్రేరణ. ఎన్నికల సంస్కరణలు ఈ లక్ష్యంతో చేపట్టడమే అభ్యంతరకరమైన విషయం కాగా, దానికి లా కమిషన్ చేసిన సూచనలు మరీ అభ్యంతరకరమైనవి. అవి ఎన్నికలవ్యవస్థలో ఇప్పుడున్న పాటి ప్రజాస్వామ్యాన్ని కూడా తగ్గించే సూచనలు. ఎన్నికల సంస్కరణలంటూ చేపడితే ప్రజాస్వామ్యాన్ని పెంచడంకోసం చేపట్టాలి, వేరే ఏ లక్ష్యం కోసమూ కాదు. ప్రజాస్వామ్యం వల్ల దేశ ఆర్థికవ్యవస్థ 'పెరుగుదల' కుంటుపడినా ఫరవాలేదు. 'పెరుగుదల' కోసం ప్రజాస్వామ్యాన్ని పణంగా పెట్టనవసరం లేదు.

రెండు పార్టీలు లేక మహా అయితే మూడు పార్టీల వ్యవస్థ ఎప్పుడయినా, ఏ దేశానికైనా మంచిదనే నిర్ణయానికి లా కమిషన్ ముందే వచ్చేసింది. అంతకంటె ఎక్కువ పార్టీలున్నట్టయితే అవి మూతపడడమైనా జరగాలి లేదా రెండు మూడు పార్టీల కూటములలో భాగమైనాకావాలి. ఇదొక కోరికయితేఫరాలేదు. తీరితే తీరుతుంది, లేకపోతెలేదు. కానీ దీనిని ఒక శాసననియమం చేయాలని లా కమిషన్ ఆదేశం.



అప్పుడే దేశరాజకీయాలలో స్థిరత్వం ఉంటుందనీ, అమెరికాలో, ఇంగ్లండ్‌లో, జర్మనీలో ఆ విధంగానే ఉందనీ లా కమిషన్ అంటుంది. మన ముఖ్యమంత్రి ఏదైనా ఎందుకిట్లా చేయాలని అడిగితే, 'సింగపూర్‌లో ఇట్లాగే చేస్తారు' అని జవాబు చెప్పినట్టు.

దీనికి లా కమిషన్ ఒక అన్యాయమైన నియమాన్ని సూచించింది. ఒక ఎన్నికలో ఒక పార్టీకి, రాష్ట్రం మొత్తంమీద (పార్లమెంట్ ఎన్నికలయితే దేశం మొత్తంమీద) అన్ని పార్టీలకూ కలిపి పోల్ అయిన మొత్తం వోట్లలో కనీసం 5 శాతం వచ్చినట్టయితేనే ఆ పార్టీ గెలుచుకున్న సీట్లు దక్కుతాయి. మొత్తంమీద 5 శాతం కంటే తక్కువ వోట్లు వచ్చినట్టయితే, ఒకవేళ ఒకటో, రెండో సీట్లు గెలిచినా అవి రద్దయిపోతాయి. రెండవస్థానంలో ఉన్న అభ్యర్థికి ఆ సీట్లు దక్కుతాయి.

ఒక చిన్న ప్రాంతానికి లేక ఒక చిన్న ప్రజావర్గానికి పరిమితమయి, వారి సమస్యలను లోతుగా అధ్యయనంచేసి, వారికి సమగ్రంగా ప్రాతినిధ్యం వహించగల పార్టీలకు స్థానం లేకుండా చేయాలనీ, బలవంతంగా ఏదో ఒక 'ప్రధాన స్రవంతి' పార్టీలో గానీ, కూటమిలో గానీ భాగమయ్యేటట్టు చట్టమే ఒత్తిడి పెట్టాలనీ ఈ సవరణ లక్ష్యం. అదెందుకు అవసరం? జనాభాలో రెండు శాతం, మూడుశాతం మాత్రముండే చిన్న చిన్న కులాలు, పొరుగు రాష్ట్రానికి చెందిన భాష మాట్లాడే బృందాలు అసంఖ్యాకంగా ఉండే ఈ దేశంలో ఇటువంటి నియమం సహేతుకమూ కాదు, ప్రజాస్వామికమూ కాదు. జర్మనీ, ఇంగ్లండ్ వంటి దేశాలు సామాజికంగా వైవిధ్యం ఉన్న దేశాలు కావు. ఆ దేశాల రాజకీయవ్యవస్థను ప్రామాణికంగా తీసుకుని మనదేశంలో సంస్కరణలు చేపట్టడం మంచిది కాదు.

మంచిచెడుల సంగతి అటుంచి, ఈ మార్పు ఎందుకు అవసరం? మొత్తంగా సమాజం గురించి ఆలోచించే పార్టీలే ఉండాలి తప్ప ఒక ప్రాంతానికో, ప్రజావర్గానికో పరిమితమయి పనిచేసేవి ఉండడం తప్పంట. అది 'కులతత్వం' లేక 'ప్రాంతీయతత్వం' అవుతుందంట. ఉదాహరణకు మన రాష్ట్రంలో ఆదివాసీలు 6 శాతం ఉన్నారు. ఆదివాసీల మేలుకోసం మాత్రమే పనిచేసే పార్టీ ఒకటి ఉందనుకోండి, ఆ పార్టీ ఎన్నికలలో పోటీచేస్తే ఆదివాసీలందరూ ఆ పార్టీకే వోటువేసినా మొత్తం రాష్ట్రంలో పోలయిన వోట్లలో 6 శాతం మాత్రమే ఆ పార్టీకి వస్తాయి. ఒక్క శాతం తక్కువపడినా 5 శాతం మించి రావాలన్న నియమానికి ఆ పార్టీ బలవుతుంది. అప్పుడు ఏజెన్సీ ప్రాంతాలలో కొన్ని సీట్లు గెలుచుకున్నా, గెలవనిదవుతుంది. గిరిజనేతరుల వోట్లతో రెండవస్థానం పొందిన కాంగ్రెస్ అభ్యర్థో, తెలుగుదేశం అభ్యర్థో ఎంఎల్ఏ అవుతాడు. 'కులతత్వాన్ని' రూపుమాపాలన్న లా కమిషన్ ప్రయాస దీనికి దారితీస్తుంది.

ఎన్నికలు ప్రాతినిధ్యం కోసమని అనుకుంటే ఈ విమర్శ అర్థమవుతుంది. ప్రభుత్వాల స్థిరత్వం ఎన్నికల లక్ష్యమనుకుంటే ఇవన్నీ తోచవు. ఎన్నికయిన ప్రజాప్రతినిధులు ప్రజలకు ఏ మేరకయినా ప్రాతినిధ్యం వహించినా, లేకపోయినా ఫరవాలేదు, ప్రభుత్వాలు స్థిరంగా ఉంటే చాలు. ఇదీ ఎన్నికల సంస్కరణల వెనకున్న ఆలోచనా రీతి.

దీనికి తోడుపోయే మరొక ప్రతిపాదన, స్వతంత్రఅభ్యర్థులనే వాళ్ళే లేకుండా చేయడం. ఏదో ఒక రిజిష్టర్డ్‌పార్టీ ప్రతినిధులే తప్ప స్వతంత్రఅభ్యర్థులెవరూ ఎన్నికలలో పోటీచేయడానికి వీలుండకూడదంట. 'స్థిరత్వం' ప్రధానమైన దృష్టికి ఇది సహజం. ఆ దృష్టితో చూస్తే చట్టసభలలో స్వతంత్రఅభ్యర్థులకు స్థానమేమీ ఉండదు. వాళ్ళ వల్ల ఎప్పుడయినా అస్థిరత రాగలదు. వాళ్ళు ఒకసారి పాలకపక్షాన్ని సపోర్ట్‌చేస్తే, మరొకసారి ప్రతిపక్షాన్ని చేయొచ్చు. కాబట్టి వాళ్ళనసలే చట్టసభలలో లేకుండా చేసేస్తే సరిపోలేదా?

స్వతంత్రఅభ్యర్థులంతా ఎప్పుడూ 'నాన్ సీరియస్'గానే పోటీచేస్తారని లా కమిషన్ అభిప్రాయపడింది. దీనికి ఆధారమేమిటంటే వారిలో అధికభాగం ప్రతీ ఎన్నికలోనూ డిపాజిట్లు కోల్పోవడం. అయితే డిపాజిట్లు కోల్పోయిన వారందరూ నాన్ సీరియస్ అభ్యర్థులూ కారు, డిపాజిట్లు దక్కించుకున్న వారందరూ సీరియస్ అభ్యర్థులూ కారు.

ఏవైనా బలమైన ప్రజా ఉద్యమాలు నడిచిన చోట, ఆ ఉద్యమాల తరఫున స్వతంత్రఅభ్యర్థులు ఎన్నికలలో పోటీచేసిన ఉదంతాలు ఈ యాభై ఏళ్ళ చరిత్రలో అనేకం ఉన్నాయి. గెలవకపోయినా —డిపాజిట్ కూడా దక్కించుకోకపోయినా —ఆ ఉద్యమానికి సంబంధించిన దృక్పథాన్ని బలంగా చర్చకు పెట్టిన స్వతంత్ర అభ్యర్థులనేకులున్నారు. ఇదంతా ప్రజాస్వామ్యంలో భాగం కాదా? గెలవడం, డిపాజిట్లు దక్కించుకోవడం —ఇవి మాత్రమే ప్రజాస్వామ్యంలో భాగమా? ప్రభుత్వాల స్థిరత్వాన్ని ప్రధానంచేసి ప్రజాస్వామ్యానికి గల అర్థాన్ని కుదించివేయవలసిన అవసర మేమొచ్చింది?

నిజానికి ప్రాతినిధ్య ప్రజాస్వామ్యాన్ని మరింత అర్థవంతం చేయగల ప్రతిపాదనలు అనేక సందర్భాలలో చర్చకు వచ్చి ఉన్నాయి. అవేవీ లా కమిషన్ సంస్కరణల అజెండాలో లేకపోవడం గమనార్హం. వీటిలో 'రీకాల్' హక్కు ఒకటి. ఒకసారి ఎన్నికయిన చట్టసభ అయిదేళ్ళపాటు స్థిరంగా ఉండాలన్న లా కమిషన్ అభిలాష ఎంత బలమైనదంటే ప్రాతినిధ్యం గాఢతను పెంచే 'రీకాల్ హక్కు' సూచన చర్చకు కూడా రాలేదు. రీకాల్ హక్కుకు నిర్దిష్టమైన అర్థం ఇవ్వడంలో సమస్యలున్నాయి, కాదనలేము. రీకాల్ చేయడానికి ఏదో ఒక రూపంలో రెఫరెండం పెట్టవలసి ఉంటుంది. చీటికిమాటికీ అది సాధ్యం కాదు. కాబట్టి ఎంతమంది నియోజకవర్గీయులు కోరుకుంటే రీకాల్ కోసం రెఫరెండం పెట్టాలనేది ఆలోచించవలసిన విషయమే. అయినప్పటికీ ఆ చర్చే అక్కరలేదనుకునే సంస్కరణాభిలాషను ఏమనాలి?

చట్టసభల ప్రాతినిధ్య స్వభావాన్ని పెంచడానికి మరికొన్ని సూచనలు చర్చించవచ్చును. మన నియోజకవర్గాలు మరీ పెద్దవి. లక్షలాది ప్రజలకు ఒకరు ప్రతినిధి అనడంలో పెద్దగా అర్థం లేదు. ఉదాహరణకు ఇంగ్లండ్‌లోని ఒక్కొక్క పార్లమెంట్ నియోజకవర్గం మన దగ్గర ఒక మండలమంత ఉంటుంది. అంటే అక్కడ ఒక ఎం.పి. ఇక్కడ మండల ప్రెసిడెంట్ లాంటి వాడు. ఆ రకమైన ప్రాతినిధ్యానికి కొంత అర్థం ఉంటుంది. కానీ 10 లక్షల జనాభాకూ, 15 లక్షల జనాభాకూ ఒకరు ప్రతినిధి అంటే పెద్దగా అర్థం లేదు.

నియోజకవర్గాలను 'చిన్నవి' చేయడం దీనికొక జవాబు. కానీ ఇప్పుడున్న దానిలో సగంచేసినా పార్లమెంటు సైజు 1000 దాటుతుంది. కాబట్టి అంతకంటె మెరుగయిన పని, నిర్ణయాధికారాలను కిందకు తీసుకురావడం. ఏ స్థాయిలో తీసుకోగల నిర్ణయాలు, ఆ స్థాయిలోని ప్రజాప్రతినిధుల సభలు తీసుకునేటట్టు రాజ్యాంగాన్ని సవరించాలి. పైకిపోయే కొద్దీ అధికారాలు తక్కువ ఉండాలి.

ఈ రకమైన ఆలోచనలు చేయాలంటే ప్రజాస్వామ్యాన్ని పెంపొందించే దృష్టితో ఎన్నికల సంస్కరణలు చేపట్టాలి. ప్రభుత్వాల స్థిరత్వాన్ని పెంపొందించే సంస్కరణ దృష్టికి ఇవి తోచకపోవడంలో ఆశ్చర్యం ఏముంది?